క్లుప్తంగా

పీజీసెట్ రిపోర్టింగ్ తేదీ పొడిగించాలి



రిజిస్ట్రార్ ధనుంజయరావుకు వినతిపత్రం అందిస్తున్న బీసీ సంఘం నాయకులు

విశాఖ సిటీ: ఏపీ పీజీసెట్–2024లో అడ్మిషన్లు పొందిన వారు రిపోర్టింగ్ చేసే తేదీని పొడిగించాలని బీసీ సంఘం నాయకులు సోమవారం ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయ రావుకు వినతిపత్రం అందజేశారు. వర్షాల కారణంగా గ్రామాల నుంచి విద్యార్థులు రాలేని పరిస్థితి ఉందని, అందుకే తేదీ పొడిగింపుపై ఆలోచించాలని కోరారు. దీనిపై రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో బీసీ సంఘం నాయకులు పితాని ప్రసాద్, దంతేశ్వర్ పట్నాయక్ ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు నేడు రాస్తారోకోలు

మద్దిలపాలెం: స్టీల్‌ప్లాంట్ రక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం చేపట్టనున్న రాస్తారోకోను అన్నివర్గాల ప్రజలు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్వీ కుమార్ పిలుపు నిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముడిసరుకు కేటాయించాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ అఖిల పక్ష కార్మిక రైతు ప్రజాసంఘాల రాష్ట్ర జేసీ ఆందోళనకు పిలుపునిచ్చిందన్నారు. బుధవారం ఉదయం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నుంచి నిరసన ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు.

పునరావాస కేంద్రంలో భోజనాల పంపిణీ



వృద్ధులకు భోజనాలు అందిస్తున్న స్థానిక నాయకులు, జీవీఎంసీ సిబ్బంది

ఆరిలోవ: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముందు జాగ్రత్తగా ఆరిలోవ ప్రాంతంలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో పలువురు తలదాచుకుంటున్నారు. ఆరిలోవ జైభీం నగర్ దరి రేకుల షెడ్లో ఉంటున్న వారి కోసం 13వ వార్డు జీవీఎంసీ కార్యాలయంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడ ఉన్న వృద్ధులు, మహిళలకు కార్పొరేటర్ కెల్ల సునీత సోమవారం మధ్యాహ్నం భోజనాలు పంపిణీ చేశారు. వార్డు సీవో అప్పలకొండ, స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, దుర్గారావు తదితరులు వృద్ధులకు వాటిని అందజేశారు.

ముగిసిన నేత్రదాన పక్షోత్సవాలు

సీతంపేట: జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో సోమవారం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివానంద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంధత్వ నివారణకు నేత్రదాన ఆవశ్యకతపై 15 రోజులపాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని అభినందించారు. మరణించిన తర్వాత కూడా నేత్రదానం వల్ల చిరంజీవులుగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా నేత్రదాన ఆవశ్యకతపై విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వైద్యులు ప్రభాకర శాస్త్రి, జ్యోతిర్మయి, ఆర్ఎంవో నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

న్యూ లుక్

- రూ.71 లక్షలతో గిరిజన వసతి గృహం ఆధునికీకరణ
- మెరుగైన టాయిలెట్స్, రూమ్స్, ఫ్లోరింగ్, విద్యుత్ సదుపాయం
- సౌకర్యాలపై విద్యార్థినుల సంతృప్తి



వసతి గృహ ముఖద్వారం



ఎంవీపీ సెక్టార్–10లో ఆధునికీకరించిన గిరిజన బాలికల వసతి గృహ సముదాయం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–10లోని గిరిజన బాలికల వసతి గృహం ఆధునికతను సంతరించుకుంది. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచనలతో ఈ హాస్టల్‌ను పూర్తి స్థాయిలో ఆధునికీకరించారు. దశాబ్దాల చరిత్ర ఉన్న ఈ వసతి గృహం చాలా కాలం నుంచి అభివృద్ధికి నోచుకోలేదు. టాయిలెట్స్ పాడవడంతోపాటు విద్యార్థినుల గదుల్లో ఫ్లోరింగ్ చాలా వరకు దెబ్బతింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో సీఎస్సార్ నిధులు రూ.71 లక్షలతో వసతి గృహాన్ని ఆధునికంగా తీర్చిదిద్దారు. ఇక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలుపై విద్యార్థినులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అన్ని సదుపాయాలతో ఆధునికీకరణ

గిరిజన వసతి గృహంలో ప్రస్తుతం 270 మంది విద్యార్థినులు ఆశ్రయం పొందుతున్నారు. వీరిలో 30 మంది పీజీ విద్యార్థినులు, 140 మంది వరకు డిగ్రీ, పీజీ విద్యార్థులు ఉన్నారు. ఆధునికీకరణలో భాగంగా రూ.38 లక్షలతో టాయిలెట్ల మరమ్మతులు, రెనోవేషన్ పనులు చేపట్టారు. రూ.33 లక్షలతో భవనం రిపేర్స్, ఫ్లోరింగ్, రెనోవేషన్ వర్క్స్ నిర్వహించారు. విద్యుత్ సదుపాయాన్ని పూర్తిస్థాయిలో మెరుగు పరిచారు. వాల్ పెయింటింగ్స్, గ్రౌండ్ ఫ్లోర్ విండోస్ రీప్లేస్‌మెంట్, గదుల్లో నూతన ఫ్లోరింగ్ వంటి పనులు చేపట్టారు. 2వ అంతస్తులోని సీలింగ్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. కిచెన్ డోర్స్, సెల్ఫ్‌లు ఏర్పాటు చేశారు.



టైల్స్‌తో నూతన ఫ్లోరింగ్



హాస్టల్ మధ్యలో తీర్చిదిద్దిన యుటిలిటీ ఏరియా

విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు

ఇటీవల వసతి గృహాన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించడంతో విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వారి అవసరాలకు అనుగుణంగా హాస్టల్‌లో సౌకర్యాలు కల్పిస్తున్నాం. నిత్యం మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నాం. వసతి గృహానికి కొంత సిబ్బంది కొరత ఉంది. దీన్ని జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సెక్యూరిటీ గార్డు నియామకం జరుగుతుంది. విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రాత్రి 7 గంటల తరువాత ఎవరినీ బయటకు అనుమతించం. మా విజ్ఞప్తి మేరకు ఎంవీపీ నైట్ బీట్ పోలీసులు ప్రతిరోజు రాత్రి పూట హాస్టల్ పరిసరాల్లో గస్తీ నిర్వహిస్తుంటారు.

– ఝాన్సీ, హాస్టల్ వార్డెన్

చెస్ చాంపియన్‌షిప్‌లో అఖిల్‌కు పతకాలు



పతకాలతో అఖిల్ ప్రసాద్

ఎంవీపీకాలనీ: శ్రీలంక వేదికగా జరిగిన కామన్ వెల్త్ యూత్ చెస్ చాంపియన్‌షిప్‌లో విశాఖ బాలుడు గారపాటి అఖిల్ ప్రసాద్ సత్తా చాటాడు. ఎంవీపీ కాలనీకి చెందిన అఖిల్ ప్రసాద్ చాంపియన్‌షిప్‌లో రెండు రజిత పతకాలు సాధించాడు. ఆగస్టు 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు అండర్–12 కామన్ వెల్త్ యూత్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు శ్రీలంకలో జరిగాయి. ఈ పోటీల్లో రాపిడ్, క్లాసికల్ ఫార్మెట్‌లలో అఖిల ప్రసాద్ 2 రజితాలు సాధించాడు. క్లాసికల్ విభాగంలో 24 మంది క్రీడాకారులు పోటీ పడగా 6.5 పాయింట్లతో 2వ స్థానాన్ని, రాపిడ్ విభాగంలో 31 మంది క్రీడాకారులు పోటీ పడగా 5.5 పాయింట్లు సాధించి 2వ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. తల్లిదండ్రులు గారపాటి శ్రీధర్, లక్ష్మీచైతన్యలతో పాటు పలువురు నగర క్రీడా ప్రముఖులు అఖిల్ ప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు.

పర్యావరణం, నీటి వనరులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న ఆచార్య ఎం.వి.ఆర్.రాజు

విశాఖ సిటీ: పర్యావరణ పరిరక్షణకు ప్రజల ఆలోచన ధోరణి మారాలని ఏయూ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు సూచించారు. ఏయూ బయో టెక్నాలజీ విభాగంలో సోమవారం బయో ఈ3 పాలసీపై జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడాలంటే.. చెట్ల నరికివేతను నిలిపివేయాలని, నీటి వనరుల ప్రాంతాల్లో నిర్మాణాలను నిరోధించాలన్నారు. సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ) ప్రతినిధి డాక్టర్ యతీష్ ఆచార్ మాట్లాడుతూ భవిష్యత్తులో బయోటెక్నాలజీతో సాంకేతిక విప్లవం వస్తుందని, 2030 నాటికి బయో ఎకానమీ 300 బిలియన్ డాలర్లు దాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి బయో ఎకానమీ 10 ట్రిలియన్ డాలర్లతో దేశ జీడీపీలో 25 శాతం మేర వాటా ఉండే అవకాశం ఉంటుందని చెప్పారు. సదస్సులో సీడీఎఫ్‌డీ ప్రతినిధులు డాక్టర్ ఎస్.మధుసూదన్ రెడ్డి, డాక్టర్ ఎం.వి.సుబ్బారెడ్డి, డాక్టర్ రమేష్ ఎలగందుల, డాక్టర్ అశ్విన్ దలాల్, ఏయూ బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్లు డాక్టర్ పోలా సుధాకర్, డాక్టర్ ధనుంజయ్, డాక్టర్ పి.బిందియా, డాక్టర్ సుబ్బాతాతా, ప్రొఫెసర్ పద్దయ్య, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవ్వులు పూయించిన నాటికలు



పుటుక్కు జర జర డుబుక్కు మే.. నాటికలోని ఓ సన్నివేశం



బాదంగీర్ సాయిని సత్కరిస్తున్న ఎంవీపీ సిటీ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

మద్దిలపాలెం: బాదంగీర్ సాయి సారథ్యంలో రంగసాయి నాటక గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం ఎంవీపీ సిటీలో విశాఖకు చెందిన కేవీ మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులు ప్రదర్శించిన పుటుక్కు జర జర డుబుక్కు మే.. నాటిక ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించింది. పి.శివప్రసాద్ దర్శకత్వంలో 165వ నాటికగా దీనిని ప్రదర్శించారు. సందేశాత్మక, ప్రయోగాత్మక, హాస్య నాటికగా పుటుక్కు జర జర డుబుక్కు మే ఆనందాన్ని పంచింది. ప్రేక్షకులు ఆనందడోలికల్లో మునిగితేలేలా నటీనటులు నాటిక ఆద్యంతం వారి ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. అనంతరం మాడభూషి దివాకర్ బాబు రాసిన ఎరువు సొమ్ము.. బరువు చేటు నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. పి.శివప్రసాద్ దర్శకత్వంలో ఈ నాటికను ప్రదర్శించారు. ప్రసాదంగా పి.శివప్రసాద్, జానకిగా కె.విజయలలక్ష్మి, కాశీపతిగా సెల్వరాజ్, రామనాథంగా ఓలేటి శంకర్, చాకలిగా ఈటి రాంబాబు, వేలంపాట వెంకిగా చంద్రరావు, పేపర్ బాయ్‌గా అప్పలరాజు నటించి మెప్పించారు. ఈ నాటికలకు సంగీతం సత్యనారాయణ అందించగా, సెట్టింగ్‌లను అప్పారావు, మేకప్‌ను సుబ్బారావు చేశారు. లైటింగ్‌కు ఎం.అప్పలరాజు సహకారం అందించారు. రంగసాయి బృందం శివజ్యోతి, వియ్యపు రామకృష్ణ, చిన్నబాబు, ఆదినారాయణ సహకరించారు. ఈ సందర్భంగా బాదంగీర్ సాయిని ఎంవీపీ సిటీ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు.

'ఒయాసిస్' వైద్యుల నిర్లక్ష్యంపై పోలీసులకు ఫిర్యాదు



ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు రోజా

బీచ్‌రోడ్డు: రామ్‌నగర్ ఒయాసిస్ ఐవీఎఫ్ సెంటర్‌లో వైద్య పరీక్షలు సరిగ్గా చేయకపోవడంతోపాటు వైద్యులు నిర్లక్ష్యం వహించడంతో తన భార్య ప్రాణాపాయ స్థితికి చేరిందని ఆరోపిస్తూ భర్త పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలిలా.. అనకాపల్లి జిల్లా సబ్బవరానికి చెందిన పాంగి నసీంద్ర కుమార్ తన భార్య రోజాకు సంతానం కోసమని గత నెల 20న విశాఖ రామ్‌నగర్‌లోని ఒయాసిస్ ఐవీఎఫ్ సెంటర్‌ను సంప్రదించారు. అక్కడి వైద్యులు వారికి పలు వైద్య పరీక్షలు చేశారు. ఈ నెల 2న మళ్లీ వారు ఆస్పత్రికి రాగా.. పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఎటువంటి సమస్య లేదని చెప్పారు. రెండు రోజుల తర్వాత రోజాకు కడుపులో నొప్పి తీవ్రంగా రావడంతో సమీప ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పలు పరీక్షలు చేసి.. ఆమె లోపల అధిక రక్తస్రావం జరిగినట్లు నిర్ధారించి, అత్యవసర శస్త్రచికిత్సలు నిర్వహించారు. రోజా ఎక్టోపిక్ గర్భం(గర్భాశయం బయట) దాల్చిందని, అందువల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వైద్యులు తెలిపారు. తమకు ఈ గర్భం కోసం ఒయాసిస్ సెంటర్ డాక్టర్లు తెలియజేయలేదని, పైగా ఎటువంటి సమస్య లేదని చెప్పారని బాధితులు వాపోయారు. కేవలం ఒయాసిస్ ఐవీఎఫ్ సెంటర్ వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన భార్య రోజా అనారోగ్యానికి గురైందని భర్త పేర్కొంటూ ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ ఘటనపై ఒయాసిస్ ఐవీఎఫ్ సెంటర్ యాజమాన్యాన్ని వివరణ కోరగా.. వైద్య పరీక్షల ద్వారా కొన్నిసార్లు ఎక్టోపిక్ గర్భాన్ని గుర్తించలేమని ఆస్పత్రి ఎండీ డాక్టర్ రాధిక తెలిపారు.

ఎంఎల్‌బీటీ స్కూల్ విద్యార్థులకు అవార్డులు



టెన్త్ టాపర్లకు ఆర్జి మార్షల్ అవార్డులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ మధురవాణి

విశాఖ–లీగల్: ప్రముఖ కంప్యూటర్ శాస్త్రవేత్త ఆర్జి మార్షల్ అవార్డును గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ స్కూల్ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు, ఉపాధ్యక్షుడు ఆచార్య డి.దక్షిణామూర్తి అధ్యక్షత్వంలో సోమవారం బీచ్ రోడ్డులోని పాఠశాల ఆవరణలో జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థులకు ఈ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ప్రపంచ కంప్యూటర్ దిగ్గజం ఆర్జి మార్షల్ వ్యక్తిగతంగా పాఠశాలను సందర్శించి ఈ అవార్డులను ఇచ్చినట్లు చెప్పారు. పదేళ్లగా ప్రతి ఏటా పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈ అవార్డులను అందజేస్తున్నామన్నారు. 2024 మార్చిలో జరిగిన టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఎ.ఎస్.ఎన్.జి.శ్రావ్య శ్రీ, పతివాడ గాయత్రి, ఎం.మిహిరా, రాజాన భవ్య, మాకిరెడ్డి సాద్విక లకు ఈ అవార్డులు లభించాయి. కార్యక్రమాన్ని గాయత్రి విద్యా పరిషత్ సంయుక్త కార్యదర్శి డి.వి.ఎస్.కామేశ్వరరావు పర్యవేక్షించారు. స్కూల్ ప్రిన్సిపాల్ కె.మధురవాణి విద్యార్థులకు అవార్డులను బహూకరించారు.

జై గణేశా.. నమోస్తుతే



పిఠాపురం కాలనీ వినాయక మండపంలో పూజలు చేస్తున్న నిర్వాహకులు



కొత్త వెంకోజీపాలెంలో పూరీ జగన్నాథ స్వామి మండపం



పాత వెంకోజీపాలెంలో ఊయలపై రాధాకృష్ణుడిగా గణనాథుడు



భానునగర్‌లో వినాయకుడిని పూజిస్తూ కోలాటమాడిన మహిళలు



అన్నప్రసాదం వడ్డిస్తున్న పీతల గోవింద్

మద్దిలపాలెం: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. వాడవాడలా ఏర్పాటు చేసిన వినూత్న విగ్రహాలు, మండపాలు అందరినీ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పిఠాపురం కాలనీలో సంపత్ బాయ్స్ ఆధ్వర్యంలో మంగళవారం మండపం వద్ద మహా అన్నదానం నిర్వహిస్తున్నామని, సాయంత్రం గణనాథుడికి విశేష అభిషేకాలు చేస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

- 16వ వార్డు ఇసుకతోటలో బాలగణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో 1982 నుంచి 2024 వరకు క్రమం తప్పకుండా వినాయక ఉత్సవాలు జరుపుతున్నారు. ఉత్సవ కమిటీ ఏర్పాటైన నాడు 16 ఏళ్ల వయసున్న కుర్రాళ్లందరూ నేటికీ 60 ఏళ్లు వచ్చినా గణనాథుడి ఉత్సవాన్ని ఘనంగానే నిర్వహిస్తూ వస్తున్నారు. వారి ఐక్యత నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం.
- 16వ వార్డు పాత వెంకోజీపాలెంలో రాధాకృష్ణుల అవతారంలో గణనాథుడు విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. పాత వెంకోజీపాలెంలోని ఆటో స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన 15 అడుగుల విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొత్త వెంకోజీపాలెంలో 2008 నుంచి ఒక వినూత్న సెట్టింగ్‌తో మండపాన్ని ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది పూరి జగన్నాథ స్వామి సెట్టింగ్‌తో అదరగొట్టారు. ఈ మండపాన్ని చూసేందుకు భక్తులు తరలి వస్తున్నారు.
- హెచ్‌బీ కాలనీ భానునగర్‌లోని వీకే రెసిడెన్సీలో వేద పండితుడు కమలాకరశాస్త్రి ఆధ్వర్యంలో ఘనంగా లక్ష్మీగణపతి యాగం నిర్వహించారు. అపార్ట్‌మెంట్‌లోని మహిళలు, పిల్లలు రాత్రి ప్రదర్శించిన కోలాటం, నృత్య కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వినాయకుడిని ప్రార్థిస్తూ అధ్యాపకురాలు డాక్టర్ పి.ఎల్.శరణ్య, సిహెచ్.శిరీష, మల్లిక, ప్రశాంతి, మాధవి తదితరులు చేసిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీకే రెసిడెన్సీ సంఘం అధ్యక్షుడు పొట్లూరు సుధీర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

శివాజీపాలెంలో అన్నసమారాధన

బీచ్‌రోడ్డు: వినాయక ఉత్సవాల్లో భాగంగా 22వ వార్డు శివాజీపాలెంలో సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. షటిల్ కోర్ట్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలి కోసం మొక్కలు నాటుదాం

డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, సిబ్బంది

మహారాణిపేట: 'స్వచ్ఛమైన గాలిలో పెట్టుబడి పెట్టండి' అనే నినాదంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. రేసపువానిపాలెం టీబీ ఆస్పత్రి కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా తిరిగి ఆస్పత్రి వరకు జరిగింది. ఈ సందర్భంగా ధర్నా చేస్తున్న వారిని ఉద్దేశించి డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల వడగాల్పులు అధికమై వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయన్నారు. ఇలాంటి వాతావరణంలో వ్యవసాయం, ఆరోగ్యంపై పెను ప్రభావం తప్పదని హెచ్చరించారు. స్వచ్ఛమైన గాలిలో పెట్టుబడి పెట్టండని, దీని కోసం మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు డాక్టర్ జగదీష్ ప్రసాద్, బాలాజీ, ఐ.మనోరమ, బి.మురళీకృష్ణ, గణాంక అధికారి మణికుమారి, మోహన్, ఇతర వైద్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తెలతాడు చోరీ

బీచ్‌రోడ్డు: రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు చోరీకి గురైనట్లు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఏయూ అవుట్ గేట్‌లో నివసిస్తున్న ఓ మహిళ ఆదివారం రాత్రి నిద్రించే ముందు తన మెడలోని పుస్తెలతాడును తీసి పక్కన పెట్టింది. ఉదయం లేచి చూసే సరికే అది కనిపించలేదు. దీంతో ఆమె సోమవారం పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రా.. అవుట్ పోస్టా..!



హనుమంతవాక వద్ద మెడికవర్ ఆస్పత్రి బోర్డులతో ఆరిలోవ ట్రాఫిక్ అవుట్ పోస్ట్

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి హనుమంతవాక వద్ద ట్రాఫిక్ అవుట్ పోస్టు తికమకగా మారింది. ఇది పోలీస్ 'ట్రాఫిక్ అవుట్ పోస్టా.. లేక మెడికవర్ ఆస్పత్రా' అని తెలియని పరిస్థితి నెలకొంది. ఏదైనా ఫిర్యాదు చేయాలని ఇక్కడికి వెళ్లాలనుకునే వారికి దీనిపై ఉన్న ప్రకటన బోర్డులు చూసి మెడికవర్ ఆస్పత్రికి వచ్చామా అంటూ తిరిగి వెళ్లిపోతున్నారు. ఆస్పత్రే కదా అంటూ కొందరు రోగులు వైద్యం కోసం లోపలికి వెళ్తే ఖాకీ డ్రెస్‌తో లాటీలు పట్టుకొని కనిపించే పోలీసులను చూసి ఎక్కడకి వచ్చామో అంటూ వెనుదిరుగుతున్నారు. ఇక్కడ ట్రాఫిక్ అవుట్ పోస్టు ఎక్కడ ఉందో అంటూ పలువురిని అడిగితే గాని తెలియని పరిస్థితి. సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాలపై పెద్ద అక్షరాలతో బోర్డులు ఉంటాయి. ఇక్కడ మాత్రం ఆరిలోవ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అవుట్ పోస్ట్ అని ఆంగ్లంలో కనీకనిపించని విధంగా అక్షరాలతో పెయింట్ వదిలేసిన బోర్డు ఏర్పాటు చేశారు. మెడికవర్ ఆస్పత్రి బోర్డులు మాత్రం తెలుగులో పెద్ద అక్షరాలతో అవుట్ పోస్టు చుట్టూ ఏర్పాటు చేసేశారు. దీంతో ఇది ట్రాఫిక్ అవుట్ పోస్టా.. మెడకవర్ ఆస్పత్రా అంటూ గుర్తుపట్టలేక పలువురు తికమక పడుతున్నారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు



ఆరిలోవ దుర్గానగర్‌లో నిరంతరం వెలుగుతున్న విద్యుత్ లైట్లు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో జీవీఎంసీ విద్యుత్ మెయింటినెన్స్ విభాగం విలక్షణంగా మారింది. కొన్నిచోట్ల విద్యుత్ దీపాలు నెలలు పాటు వెలగకపోవడంతో చీకట్లతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మరికొన్ని చోట్ల వెలిగి ఉన్న లైట్లను ఉదయం ఆర్పడం లేదు. ఓ చోట రాత్రి పూట చీకట్లు కమ్ముకుంటే.. మరోచోట పట్టపగలే విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. జీవీఎంసీ 12వ వార్డు దుర్గానగర్‌లో ఐదు రోజులుగా సుమారు 20 వరకు వీధిలైట్లు రాత్రి, పగలు వెలుగుతూనే ఉన్నాయి. వాటిని పగటి సమయంలో ఆర్పే వారు లేకుండా పోయారు. ఇక్కడి వీధుల్లోని 85/బీ/6 నంబర్ గల విద్యుత్ స్తంభం నుంచి వరుసగా ఉన్న స్తంభాల లైట్లు నిరంతరం వెలుగుతున్నాయి. పగటి సమయంలో విద్యుత్ ఇలా వృథా అవుతోందని, సంబంధిత విభాగం అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.